కథ

# పరివర్తన

**కె.రాజేశ్వరి**

“ఏమిటే స్వాతీ! వచ్చిన దగ్గర్నుండి చూస్తున్నాను నువ్వు అదోలా ఉన్నావు.. కాలేజీలో ఎవరైనా ఏమైనా అన్నారా ఏమిటి?” రిమోట్‌తో టీవీ ఛానల్స్‌ని అదే పనిగా మారుస్తున్న కూతుర్ని చూసి అడిగింది సుజాత.

“ఏం లేదమ్మా! బాగానే ఉన్నానుగా”

“లేదు.. ఈసారి నువ్వు ఎప్పట్లా లేవు. ఏదో జరిగింది. ఏం జరిగిందో చెప్పవే” లాలనగా కూతురి తల నిమురుతూ అడిగింది.

“అబ్బ... ఏం జరగలేదమ్మా”

“మరి... ఒంట్లో బాగాలేదా?”

“బాగానే ఉన్నానమ్మా. నాకేం కాలేదు కానీ నువ్వే అనవసరంగా ఏదేదో ఊహించుకుంటున్నావు”

“సర్లేమ్మా... నాకెందుకొచ్చింది. సాయంత్రం మీ నాన్నగారు వచ్చాక అప్పుడు చెబుదువు కానీ... ఎంతైనా నాన్న కూతురివి కదా. దేనికో టెన్షన్ పడుతున్నట్లు నిన్ను చూసిన ఎవరికైనా అర్థమవుతుంది. కన్నతల్లిని కదా. ఏదో ఉండబట్టలేక అడిగాననుకో”

అప్పటికీ ఏం మాట్లాడకుండా రిమోట్‌తో కుస్తీ పడుతున్న కూతుర్ని చూసి ‘హు... జగమొండి’ అనుకొంటూ వంటగదిలోకి వెళ్లిపోయింది.

స్వాతి వాళ్ల నాన్న మోహన్‌రావుది హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బిజినెస్. ఒక కొడుకు.. ఒక కూతురు. కొడుకు సునీల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి అక్కడే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. స్వాతి విజయవాడలో ఎం.బి.బి.యస్. ఫైనలియర్ చదువుతోంది. దగ్గరే కావటంతో వీలైనంత వరకు ప్రతి వారం ఇంటికి వస్తుంది. శనివారం సాయంత్రం బయల్దేరి వచ్చి సోమవారం ఉదయాన్నే కాలేజీ టైముకి విజయవాడ చేరుకునేది.

కానీ ఈసారి మాత్రం శుక్రవారం రాత్రికే హైదరాబాద్ వచ్చింది. శనివారం ఉదయాన్నే స్నానం చేసి టిఫిన్ తిని ఫ్రెండింటికని వెళ్లి భోజనం టైముకి ఇంటికి వచ్చింది. ఆకలిగా లేదని ఏదో రెండు ముద్దలు కెలికి రిమోట్ తీసుకొని నిముషానికో ఛానల్ మారుస్తూ చాలా మూడీగా కూర్చుంది.

ఎప్పుడు ఇంటికి వచ్చినా వసపిట్టలా కాలేజీ కబుర్లు, హాస్టల్ కబుర్లు చెబుతూ సందడి చేసే పిల్ల అలా మూడీగా ఉండేసరికి సుజాతకి ఏం తోచలేదు. వంటగదిలో అవీ ఇవీ సర్దుతున్నట్లు నటిస్తూ కూతుర్ని గమనించసాగింది.

అరగంట తర్వాత టీవీ కట్టేసి చేతిగోళ్లు కొరుక్కుంటూ వరండాలోకి, హాల్లోకి తిరగసాగింది. కాలు గాలిన పిల్లిలా తిరుగుతున్న స్వాతిని చూసి ‘మొత్తానికి ఏదో జరిగింది. ఏం జరిగిందంటే చెప్పదు. ఏం పిల్లో ఏమిటో...’ అనుకొంటూ బెడ్‌రూంలోకి వెళ్లి నడుం వాల్చింది.

కాసేపయ్యాక వచ్చి తన పక్కనే పడుకున్న కూతుర్ని చూసి ఏదైనా చెబుతుందేమోనని ఎదురు చూసింది. స్వాతి అటు తిరిగి మౌనంగా పడుకోవటం చూసి ‘ఓర్తి మొండి ఘటం...’ అనుకొంటూ కళ్లు మూసుకొని పడుకుంది.

రాత్రి ఎనిమిదయ్యేసరికి మోహన్‌రావు, సునీల్ ఇంటికి వచ్చారు. భోజనాల దగ్గర కూర్చున్నప్పుడు అన్నం తినకుండా కంచంలో వేళ్లతో కెలుకుతున్న స్వాతిని చూసి “ఏంట్రా భోం చెయ్యకుండా అలా కూర్చున్నావ్. అమ్మ చేసిన కూరలు నచ్చలేదా ఏమిటి?” జోక్‌గా అన్నారు మోహన్‌రావుగారు.

“అదేం లేదు నాన్నగారు. అమ్మ వంటకేం చాలా బాగా చేస్తుందైతే...”

“మరెందుకురా తినకుండా అలా కెలుకుతున్నావు.. ఆకలిగా లేదా లేక ఒంట్లో బాగా లేదా?”

“ఆకలి లేకపోవటం ఏం లేదండి. అది ఉదయం కూడా సరిగా తినలేదు. ఈ సారి అది వచ్చినప్పటి నుండి చాలా మూడీగా ఉంటోంది. ఏం జరిగిందంటే చెప్పదు. మీరైనా అడగండి” కంప్లైంట్ చేసింది తల్లి.

ఎప్పుడూ భోజనాల దగ్గర లొడలొడ వాగుతూ అందర్నీ నవ్వించే స్వాతి ఈ రోజు అలా మౌనంగా ఉండేసరికి మోహన్‌రావుగారికి కూడా కొంచెం బాధనిపించింది.

“ఏంటే... ఏం జరిగింది. ఎందకలా ఉన్నావు?” ఆదుర్దాగా అడిగాడు సునీల్.

తను అడగాలనుకున్న ప్రశ్న కొడుకు అడిగేసరికి ఏం చెబుతుందా అని కూతురివైపు చూశారు.

“ఏం లేదన్నయ్యా! అమ్మ అలాగే అంటుందిలే”

“లేదమ్మా. నిన్ను చూస్తుంటే దేనికో బాధపడుతున్నట్లున్నావు. ఏం జరిగిందో చెప్పమ్మా”

“ఏం లేదు నాన్నగారు! ముందు భోజనాలు కానివ్వండి. తర్వాత మాట్లాడుకుందాము”

ఆ మాటతో అందరు పరిపరివిధాలుగా ఆలోచించుకొంటూ భోజనాలు కానిచ్చారు.

నలుగురూ వచ్చి హాల్లో కూర్చున్నారు. కూతురి పక్కనే సోఫాలో కూర్చుని తలమీద చెయ్యేసి నిమురుతూ “చెప్పరా... ఏం జరిగింది. ఎవరైనా ఏమైనా అన్నారా?” లాలనగా అడిగారు.

“అలాంటిదేం లేదండి”

“మరి... ఈసారి ఎగ్జామ్స్ సరిగా రాయలేదా?”

“నా కూతురి చదువు విషయంలో డౌటే లేదు. ఆ విషయంలో నేను గ్యారంటీ ఇవ్వగలను” సునీల్ ప్రశ్న విని సీరియస్‌గా చూస్తున్న స్వాతిని చూసి తనే సమాధానం చెప్పారు మోహనరావు.

“మరేమిటే నీ బాధ... ఉదయం నుండి టెన్షన్‌తో చంపుతున్నావు. ఇప్పటికైనా చెప్పవే తల్లీ” కొంచెం విసుగ్గా అన్నది తల్లి.

“మరి... మరి...” తలొంచుకుని చేతివేళ్ల వంక చూసుకొంటూ ఎలా చెప్పాలో తెలీక టెన్షన్ పడుతున్న కూతుర్ని చూసి

“కొంపదీసి ఎవర్నైనా ప్రేమించావా ఏమిటి? అలాగైతే ధైర్యంగా చెప్పేసేయ్. ఎటూ అన్నయ్యది కుదిరిపోయినట్లే కదా. రెండు పెళ్లిళ్లు ఒకేసారి చేసేస్తే నాకూ ఖర్చు కలిసొస్తుంది. పైగా పెళ్లికొడుకుని వెదికే బాధా తప్పుతుంది” నవ్వుతూ జోక్ చేశారు మోహన్‌రావుగారు.

“మీకంతా వేళాకోళమే. టెన్షన్‌తో చంపక ఏం జరిగిందో చెప్పవే”

సీరియస్‌గా అంటున్న తల్లిని చూసి “నాన్నగారు అన్నది నిజమేనమ్మా” అన్నది.

ఆ మాటకి అందరూ బిత్తరపోయారు.




"ఏమిటే నువ్వనేది.. ప్రేమలో పడ్డావా? ఎవడే వాడు? మన వాళ్లబ్బాయేనా?"

"మనవాళ్లేనమ్మా.. మా ఫ్రెండ్ వాళ్ల అన్నయ్యే"

"బావుంటాడలే, ఏం చదివాడు?" అడిగాడు సునీల్ ఆసక్తిగా చూస్తూ.

"బాగానే ఉంటాడు. ఇంజనీరింగ్ అయిపోయి జాబ్ చేస్తున్నాడు"

"మరింకేం.. ఇది చెప్పటానికెందుకు ఇంతగా సంశయిస్తున్నావ్?" అడిగాడు తండ్రి.

"మరి... మరి... వాళ్లింట్లో వాళ్లు తనకి వేరే సంబంధం చూశారట నాన్నగారూ!"

"అదేంటే వన్‌సైడ్ లవ్వా ఏంటి?" సరదాగా అడిగాడు సునీల్.

"లేదన్నయ్యా తనకీ నేనంటే ఇష్టమే"

"మరి... పెద్దవాళ్లు ఒప్పుకోవటం లేదా?"

సీరియస్‌గా అడుగుతున్న తండ్రిని చూసి "అలాంటిదేం లేదండి. అసలు మా ప్రేమ విషయం తనే వాళ్లింట్లో చెప్పలేదంట. విషయం తెలియక వాళ్ల పేరెంట్స్ వేరే సంబంధం చూశారట. దాదాపు ఖాయమైనట్లే" దిగులుగా అన్నది.

"అదేమిటి... పెళ్లనేది ఇద్దరి జీవితాలకి సంబంధించినది కదా. అంతగా నిన్ను ఇష్టపడ్డప్పుడు ఇంట్లో చెప్పటానికేమైందట. ఇంట్లోవాళ్లకి చెప్పటానికి భయంవా లేక అవతలి వాళ్లు కట్నకానుకలు దండిగా ఇస్తున్నారా?"

"రెండూను" తండ్రి మొహంలో కనిపిస్తున్న సీరియస్‌నెస్ చూసి కాస్త భయపడి తలొంచుకొని చిన్నగా చెప్పింది.

"నీ మాటల్ని బట్టి చూస్తుంటే వాడొట్టి డబ్బు మనిషి పిరికివాడని అనిపిస్తుంది. అలాంటి వాణ్ని చేసుకున్నా నువ్వు సుఖపడలేవు. అతని గురించి ఆలోచిస్తూ నీ చదువు పాడుచేసుకోకు. దేశంలో పెళ్లికొడుకులకేం కొరత లేదు. ఇంకా చెప్పాలంటే ఆడపిల్లలే తక్కువగా ఉన్నారని అంటున్నారు. నీ చదువు పూర్తికాగానే మంచి సంబంధం చూసి పెళ్లి చేస్తాము. అంతవరకు అతని గురించి ఆలోచించకుండా బుద్ధిగా చదువుకో" కూతురి భుజం చుట్టూ చెయ్యేసి బుజ్జగిస్తున్నట్లు చెప్పారు.

"కానీ... నాన్నగారూ...!"

"ఏమిటమ్మా ఇంకా కానీలు, అర్థణాలు. నా మాట విని వాణ్ని మరచిపో"

"లేదండి.. అతణ్నే చేసుకోవాలి. లేకపోతే..."

"ఊ.. లేకపోతే.."

"నా జీవితం అన్యాయమైపోతుంది నాన్నగారూ" ఏడుస్తూ రెండు చేతుల్లో మొహం దాచుకుంది.

అక్కడున్న ముగ్గురికి ఏదో జరగరానిది జరిగి ఉంటుందని అర్థమైపోయింది.

"ఏమిటమ్మా నువ్వనేది? ఏం జరిగిందో అర్థమయ్యేలా చెప్పు" లాలనగా అడిగారు.

"జరగరాని ఘోరం జరిగిపోయింది నాన్నగారూ. అతను కాదంటే నాకు చావే శరణ్యం. ఇంతకంటే నేనేం చెప్పలేను" ఏడుస్తూ బెడ్‌రూంలోకి వెళ్లిపోయింది.

స్వాతి మాటలకి బిత్తరపోయారు ముగ్గురూ. కాసేపటి వరకు ఆ షాక్ నుండి కోలుకోలేకపోయారు.

'ఎలా.. ఎలా జరిగింది ఇంత ఘోరం? నా స్వాతి... నా స్వాతి తప్పు చేసిందంటే ఇప్పటికి నమ్మలేకపోతున్నాను. నా కూతురుది తొందరపాటు స్వభావం కాదు. తెలిసి తెలిసీ అదిలాంటి పరువుతక్కువ పని ఎప్పటికీ చేయదు. కానీ... కానీ... అదంత గట్టిగా చెప్పిందంటే మొత్తానికి ఏదో జరిగింది. అదేమిటో నిదానంగా తెలుసుకోవాలి...'

"ఊరుకో సుజాతా! ఊరికే టెన్షన్ పడకు. అసలు అదిలాంటి పని చేసిందంటే నేనిప్పటికీ నమ్మలేకుండా ఉన్నాను. రేపు ఉదయం నిదానంగా స్వాతితో మాట్లాడి అసలేం జరిగిందో తెలుసుకొని ఏం చెయ్యాలన్నది అప్పుడు ఆలోచించుదాం"

"ఇంకా ఏమిటండీ ఆలోచించేది. జరగరాని ఘోరం జరిగిపోయిందని అదంత గట్టిగా చెప్తుంటే ఇంకా నమ్మనంటారేమిటి? పెళ్లి చేస్తామంటే 'మెడిసిన్ పూర్తి చేసి పీజీలో జాయినయ్యాకే పెళ్లి' అంటూ భీష్మించుకు కూర్చునేది. ఇప్పుడిలా తొందరపడి మన పరువు తియ్యటమెందుకు. ఒక్కగానొక్క పిల్లని ఎంత అపురూపంగా చూసుకున్నాము. ఎంత గారాబంగా పెంచాము. మనం దాని మీద పెట్టుకున్న ఆశల్ని, నమ్మకాల్ని నీరుకార్చేసింది కదండీ"


"బాధపడకు సుజాతా! కాస్త కంట్రోల్ చేసుకో. ప్రతీదానికి ఏదో ఒక పరిష్కారముంటుంది కదా. రేపు ఉదయం స్వాతినడిగి వాళ్ల వివరాలన్నీ కనుక్కొని వాళ్లతో మాట్లాడి చూద్దాం. అందాకా ఊరికే టెన్షన్ పడకు. బాధపడుతూ కూర్చుని ఆరోగ్యం పాడుచేసుకోవడమే తప్పు ఏదైనా ప్రయోజనముంటుందా చెప్పు. వెళ్లి... వెళ్లి ఈ రాత్రికి నువ్వు కూడా దాని దగ్గరే పడుకో. ఈ పరిస్థితిలో దాన్ని ఒంటరిగా ఉంచటం అంత మంచిది కాదు. దానంతట అది ఏదైనా చెప్తే విను కానీ నువ్వు దాన్నేమి అడక్కు. అన్ని విషయాలు రేపు మాట్లాడుకుందాం. లేనిపోని ఆలోచనలు పెట్టుకోక వెళ్లు..వెళ్లి పడుకో" అనునయించి కూతురి గదిలోకి పంపారు.

ఇదంతా చూస్తున్న సునీల్ తట్టుకోలేకపోయాడు.

సెక్సనేది ఓ ఆటలా అనుకొని సరదాగా ఎంజాయ్ చేస్తున్నారే నేటి యువతరం. అది ఓ ఆడపిల్ల జీవితం మీద ఇంత ప్రభావం చూపిస్తుందా..

## ప్లేయర్ జెనీలియా

డాక్టర్ని కాబోయి యాక్టర్నయ్యా అంటారు చాలామంది. ఇలాగే జెనీలియా కూడా యాక్టర్ని కావాలని ఎప్పుడూ అనుకోలేదంటోంది. మరి ఇంకేం అయ్యేవాళ్లు అంటే- మొదట్నించీ తనకి అథ్లెటిక్స్ అంటే ఇష్టం. ఫుట్‌బాల్ ఆటంటే మరీ ఇష్టంట. డేవిడ్ బెకామ్ తన అభిమాన ఫుట్‌బాల్ క్రీడాకారుడని చెబుతుంది జెనీలియా. అంటే మనం మంచి ఫుట్‌బాల్ ప్లేయర్‌ని మిస్సయ్యామని అనుకుందామా?



ఆలోచనలతో తల పగిలిపోతుంటే కణతలు నొక్కుకుంటూ సోఫాలో జారగిలపడ్డారు మోహనరావుగారు.

సుజాత ప్రాణం లేని బొమ్మలా భర్త పక్కనే కూర్చుండిపోయింది.

సునీల్ ఏదో దీర్ఘాలోచనలో పడ్డాడు.

"ఏమిటండీ ఇది... ఇదింత పరువుతక్కువ పని చేసిందేమిటి? దీని మాటల్ని బట్టి చూస్తుంటే దీని వ్యవహారం చాలా దూరం పోయినట్లుంది. రేపేదన్నా కడుపో కాలో వస్తే మన పరువేం కావాలి? ఈ విషయం బయటకి పొక్కిందంటే రేపు సునీల్‌కి పిల్లనిస్తామన్న వాళ్లు కూడా వెనక్కి తగ్గుతారు. రేపటి నుండి నలుగురిలో తలెత్తుకొని ఎలా తిరగ్గలమండీ.. పరువు పోయాక ఇక బ్రతకటమెందుకు? అందరం తలాకాస్త విషం మింగి ఒక్కసారే ఛస్తే సరి" భోరున ఏడ్చింది భర్త భుజం మీద వాలి.

ఫ్యామిలీ మొత్తాన్ని ఇంతటి ఆవేదనకి గురిచేస్తుందా?

సునీల్ ఆలోచనలని అర్థం చేసుకొని మోహనరావుగారు "సునీల్! ఈ విషయం గురించి ఎక్కడా అనకు. ఎలా జరగాలని ఉంటే అలా జరుగుతుంది కానీ లేనిపోని ఆలోచనలు పెట్టుకోక వెళ్లి పడుకో" అన్నారు.

తండ్రి మాటలతో లేచి తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. పడుకున్నాడన్నమాటే కానీ ఆలోచనలతో ఎంతకీ నిద్రపట్టలేదు. 'ఈ అవమానం భరించే కంటే తలా కాస్త విషం మింగి అందరం ఒక్కసారే ఛస్తే పోతుంది' అని తల్లి అన్న మాటలు పదేపదే గుర్తొచ్చి తెల్లవార్లూ నిద్రలేకుండా చేశాయి.

ఇంట్లో ఉన్న నలుగురు ఒకరికి తెలియకుండా ఒకరు నిద్ర నటించారే కానీ ఆ రాత్రి ఎవరికీ

కంటి మీద కునుకు లేదు. తెల్లవారగానే స్వాతి లేచి స్నానం చేసి ఫ్రెష్‌గా తయారై వచ్చి హాల్లో కూర్చుని టీవీ ఆన్ చేసింది.

రాత్రి ఏమీ జరగనట్లు అలా మామూలుగా ఉన్న స్వాతిని చూసి ఆశ్చర్యపోయారందరూ.

“టిఫిన్ రెడీ అయింది. రండి.” ముభావంగా పిలిచిన తల్లి పిలుపు విని సునీల్, స్వాతిలతో పాటు మోహన్‌రావుగారు కూడా వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు.

నిద్ర లేమితో ఎర్రబడిన కళ్లు నీరసంగా వడిలిపోయి ఎన్నో లంఖణాలు చేసినట్లున్న అమ్మానాన్నల మొహాలు చూస్తుంటే బాధనిపించింది స్వాతికి, సునీల్‌కి.

తలొంచుకొని గబగబా ఇడ్లీ తింటున్న స్వాతిని, ఇడ్లీ ముక్క తుంపి చేత్తో పట్టుకొని ఏదో ఆలోచిస్తూ కూర్చున్న సునీల్‌ని మార్చి మార్చి చూసి “ఏంట్రా సునీల్! అలా కూర్చున్నావ్? టిఫిన్ తిను” అన్నారు మోహన్‌రావుగారు.

“నాన్నగారండీ! మరి...”

ఏదో చెప్పాలనుకొని చెప్పలేకపోతున్న కొడుకుని చూసి “ఏంట్రా?” అన్నారు.

“........”

“పర్లేదు చెప్పరా” కొడుకు మౌనాన్ని చూసి మళ్లీ అడిగారు.

“అదీ...వైజాగ్ సంబంధం నాకిష్టం లేదు. వాళ్లకి వద్దని చెప్పండి” చెప్పాలనుకున్నది గబగబా చెప్పేసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

“ఏం నాయనా! నీక్కూడా ఓ లవ్ స్టోరీ ఉందా? రాత్రి ఇదొక బాంబ్ పేల్చింది. నేనేం తక్కువ తిన్నానా అని ఇప్పుడు నువ్వు మొదలెట్టావా”

తల్లి కోపం చూసి “అది కాదమ్మా! నేను.... రమ్యని చేసుకుందామనుకుంటున్నాను. అదీ మీకందరికీ ఇష్టమైతేనే” నసిగాడు.

“ఈ మాట ముందే చెప్పొచ్చు కదరా. అవతల వాళ్లకి పిల్ల నచ్చిందని చెప్పి బ్రాహ్మణ్ని అడిగి మంచి ముహూర్తం కనుక్కొని కబురు చెయ్యమని చెప్పి ఇప్పుడు కాదంటే మన పరువేం కాను. ఎందుకురా మీరిద్దరు ఇలా తయారయ్యారు. ఈ వయసులో మమ్మల్నెందుకిలా బాధ పెడుతున్నారు?”

బాధగా తలపట్టుక్కూర్చున్న తండ్రిని చూస్తుంటే జాలేసింది స్వాతికి.

“నాన్నగారూ! మీరు అనవసరంగా బాధపడి లేనిపోని టెన్షన్ పెట్టుకోవద్దు. అన్నయ్య తన వలన ఓ ఆడపిల్ల జీవితం అన్యాయమైపోకూడదని ఇప్పటికైనా మంచి నిర్ణయమే తీసుకున్నాడు”

“ఏంటమ్మా నువ్వనేది. రాత్రి నుండి అన్నాచెల్లెళ్లిద్దరూ వంతులు వేసుకున్నట్లు షాక్‌ల మీద షాక్‌లిస్తున్నారు. టెన్షన్‌తో చంపక విషయమేమిటో చెప్పు” విసుక్కున్నారు.

“మీరేం టెన్షన్ పడకండి నాన్నా! నా ఫ్రెండ్ రమ్య తెలుసు కదా సిక్స్త్ నుండి ఇంటర్ వరకు కలిసి చదువుకున్నాం. అదిప్పుడు ఇంజనీరింగ్ పూర్తి చేసి జాబ్‌లో చేరింది. అన్నయ్య, తను ఇద్దరూ ఒకే కంపెనీలో జాబ్ చేస్తున్నారు. ఇద్దరు ఈ మధ్య పెళ్లి చేసుకుందామని డిసైడయ్యారట. లాస్ట్ మంత్ ఓ సండే నేను ఉన్నాననుకొని అది నా కోసం ఫోన్ చేస్తే అన్నయ్య తీసి నేను స్నానం చేస్తున్నానని అబద్ధం చెప్పి రమ్యని మనింటికి రమ్మన్నాడట. అది మనమందరం ఇంట్లో ఉన్నామనుకొని సరదాగా గడపాలని వచ్చింది. కానీ... ఆ సండే నాకు కాస్త ఫీవరిష్‌గా ఉండి ఇంటికి రాలేనంటే అమ్మా, మీరు నా దగ్గరకి వచ్చారు. వంటరిగా ఉండేసరికి అన్నయ్య కాస్త తొందరపడ్డాడట. సర్లే పెళ్లి చేసుకుంటానని మాటిచ్చాడు కదా అనుకొంటే ఇప్పుడు తనని కాదని వేరే అమ్మాయిని చేసుకోబోతున్నాడని తెలిసిందట. వెంటనే నాకు ఫోన్ చేసింది అర్జెంటుగా రమ్మని.

ఏం జరిగిందో తెలియక క్లాసు ఎగ్గొట్టి కంగారుగా పరిగెట్టుకొచ్చాను. నిన్న ఉదయం వెళ్లింది దానింటికే. జరిగిందంతా చెప్పి, ఏం చెయ్యాలో అర్థం కావటం లేదే. మీ అన్నయ్య కాదంటే చావు తప్ప నాకు మరో మార్గం కనిపించటం లేదని భోరున ఏడ్చింది. దాన్ని చూస్తుంటే జాలేసింది. తొందరపడి ఏ అఘాయిత్యమూ చేయకు. అన్నయ్య పెళ్లి నీతోనే జరిగేలా చేస్తానని ధైర్యం చెప్పి వచ్చాను. ఇప్పుడు చెప్పండి నాన్నగారూ! ఆలస్యంగానైనా అన్నయ్య మంచి నిర్ణయమే తీసుకున్నాడు కదూ”



## లక్కీ లారా!

ఇన్నాళ్లకి లారా దత్తా నటనకు ఆస్కారం వుండే పాత్ర లభించిందని సంబరపడుతోంది. ఇటీవల తెలుగులో వచ్చిన ‘కథానాయకుడు’ (తమిళంలో ‘కుసేలన్’) చిత్రంలో మీనా ధరించిన పాత్రను లారా హిందీలో వేస్తోందిప్పుడు. ‘బిల్లూ బార్బర్’ అనే పేరుతో నిర్మాణమవుతున్న ఈ సినిమా మీద లారా ఆశలు పెంచుకుంటోంది. ప్రియదర్శన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రజనీకాంత్ పాత్రని షారుఖ్ పోషిస్తున్నాడు.

“ఇద్దరికిద్దరు నా కడుపున చెడబుట్టారే. పెళ్లి కాకుండానే ఇలా బరితెగించి తిరగటానికి సిగ్గుగా లేదూ... చేసిన ఘనకార్యాన్ని ఇంత ధైర్యంగా ఏ మొహం పెట్టుకొని చెబుతున్నారే.. మిమ్మల్నిద్దర్నీ చూడాలంటేనే అసహ్యంగా ఉంది” తల పట్టుకొని నీరసంగా కుర్చీలో కూలబడింది సుజాత.

చెయ్యి కదుక్కొని గబగబా తల్లి దగ్గరకి వచ్చి తల్లి ఒళ్లో తలపెట్టుకొని “అమ్మా! మీ పరువు తీసి మీకు తలవంపులు తెచ్చే పని నేనెప్పుడు చెయ్యనమ్మా. నేను మీ బిడ్డని... నేనెవర్నైనా ప్రేమిస్తే


ముందు మీకే చెప్తాను. నన్ను నమ్మమ్మా..." అన్నది ఏడుపుగొంతుతో.

ఆ "మరి... మరి... రాత్రి నువ్వు చెప్పిందంతా...?" అనుమానంగా చూస్తూ అడుగుతున్న తల్లిని చూసి

"అంతా అబద్ధమమ్మా. అన్నయ్య చేసిన తప్పు వాడి నోటితోనే చెప్పించాలని అలా నాటకమాడాను"

"అలా ఎందుకు చెప్పావే. నీకేదో ఘోరం జరిగిపోయిందని నువ్వేడుస్తూ ఉంటే నిజమేనుకొని మా పై ప్రాణాలు పైనే పోయాయి కదే. రాత్రంతా అందరం ఎంత టెన్షన్ పడ్డాం 'అమ్మా! జరిగిందిది' అని ఒక్క మాట... ఒక్క మాట చెప్పి ఉంటే అందరికీ ఈ టెన్షన్ తప్పేది కదా. తర్వాత అందరం కలిసి వాడికి నచ్చజెప్పేవాళ్లం"

"రాత్రంతా మీరు పడ్డ టెన్షన్ చూశాకే అన్నయ్యలో మార్పు వచ్చి రమ్యని చేసుకుంటానని బయటపెట్టాడు. ఒక ఆడపిల్లకి అన్యాయం జరిగితే అది వాళ్ల ఇంట్లో అందరి మీద ఎంత ప్రభావం చూపిస్తుందో అనుభవంలోకి వస్తేకానీ అన్నయ్యలో మార్పు రాదని ఇలా నాటకమాడానమ్మా. అందరం కలిసి నచ్చ చెప్పి బలవంతాన ఒప్పించే కంటే అన్నయ్య తన తప్పు తను తెలుసుకొని తనంతట తను మారి తన నోటితోనే రమ్య సంగతి చెప్పించాలనే ఇలా చేశాను. రాత్రంతా నువ్వు, నాన్నగారు అనుభవిస్తున్న మానసిక వేదన చూసి తట్టుకోలేక నిజం చెప్పేద్దామా... అని ఎన్నిసార్లో అనుకున్నాను. అన్నయ్యలో మార్పు కోసమని నన్ను నేను బలవంతాన కంట్రోల్ చేసుకున్నాను. మిమ్మల్నిద్దర్నీ ఇంత బాధ పెట్టినందుకు క్షమించండి నాన్నగారూ" అన్నది నీళ్లు నిండిన కళ్లతో.




"నువ్వు తప్పు చేస్తే కదరా క్షమించటానికి.. మంచి పనే చేశావు కదా. రాత్రి నువ్వు అంత ఇదిగా ఏడుస్తూ చెప్పినా నువ్వు తొందరపడి తప్పు చేశావంటే నేను నమ్మలేకపోయాన్రా.. నా నమ్మకాన్ని వమ్ము కానీయలేదు. నా కూతురివనిపించావ్. థాంక్స్‌రా" అని స్వాతిని లేపి కన్నీళ్లు తుడిచి పక్కన కూర్చోబెట్టుకొని

"ఏరా సునీల్! స్వాతి చెప్పిందంతా నిజమేనా" అనడిగారు సునీల్‌వైపు చూసి. తప్పుచేసిన వాడిలా తలొంచుకున్నాడు.

"తప్పు చేసినప్పుడు ఆ తప్పు సరిదిద్దుకొనే ప్రయత్నం చెయ్యాలి కానీ మరో తప్పు చెయ్యాలనుకోవటం మహాపరాధం. ఒక ఆడపిల్లకి అన్యాయం జరిగితే ఇంటిల్లిపాది ఎంతగా ఆవేదనకి గురవుతారో అనుభవం అయింది కదా.. ఇంకెప్పుడూ ఇలా ఆడపిల్లల జీవితాలతో ఆడుకోకు. అయినా ఇంత చదువు చదివి ఇలా సంస్కారహీనంగా ఎలా ప్రవర్తించావురా. ఆ పిల్ల ఏదన్నా అఘాయిత్యం చేసిందంటే ఆ పాపం ఊరికే పోదు. జీవితాంతం మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. వాళ్లింకా మంచివాళ్లు కాబట్టి సరిపోయింది. మరొకరైతే నువ్వు చేసిన వెధవ పనికి ఈపాటికి మనింటిమీదికొచ్చి నానా రభసా చేసేవాళ్లు. అయిందేదో అయింది... ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని రమ్యా వాళ్ల నాన్నగారికి కబురు చెయ్యి మంచిరోజు చూసుకొని రమ్యని" అన్నారు.

"థాంక్యూ.. నాన్నగారూ! థాంక్యూ" సంతోషం పట్టలేక తండ్రి చెయ్యి పట్టుకొని ఊపేసింది స్వాతి.

## త్రిష గానం

బక్కపల్చని భామ త్రిషకి కాస్తో కూస్తో సంగీతం కూడా వచ్చుట. ఒంటరిగా వున్నప్పుడు కూనిరాగాలు తీసే తనకి నలుగురిలోనూ పాడాలంటే కాస్త సిగ్గెక్కువేనట. అయితే త్వరలోనే ఆమె ఓ తమిళ సినిమాలో పాట పాడబోతోంది. ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ సినిమాలో ఓ పాట పాడుతు యత్నంలోనే రెహమాన్ లాంటి మ్యూజిక్ డైరెక్టర్‌తో పనిచేస్తున్నందుకు బోల్డు సంబరపడిపోతోంది.

